అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను హత్య చేసిన భార్య

భార్యతో పాటు హత్యకి సహకరించిన సహచరుల అరెస్ట్

సంచలన కేసును చేధించిన నారాయణఖేడ్ పోలీసులు

సంగారెడ్డి, బతుకమ్మ :సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో సంచలనానికి గురిచేసిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. అక్రమ సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడనే కారణంతో భార్య తన ప్రియుడు, అతని అన్నతో కలిసి భర్తను హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు నారాయణఖేడ్ ఇన్స్ పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, గంగాపూర్ గ్రామానికి చెందిన శంబన్‌లొల్లా ముత్యం రెడ్డి (35) టిప్పర్ మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నెల 16వ తేదీ నుంచి అతడు కనిపించకుండా పోవడంతో, మే 18న అతని భార్య శంబన్‌లొల్లా కల్పన నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు క్రైమ్ నంబర్ 127/2026 కింద మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో కల్పన ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు లోతుగా ఆరా తీశారు. దర్యాప్తులో కల్పనకు మానూర్ మండలం ఎల్లోయి గ్రామానికి చెందిన గైని పండరితో అక్రమ సంబంధం ఉన్నట్లు తెలిసింది. దీంతో పండరిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు తన అన్న గైని విట్టల్, కల్పనతో కలిసి ముత్యం రెడ్డిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం, కల్పన – పండరి మధ్య కొంతకాలంగా సన్నిహిత సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న ముత్యం రెడ్డి పలుమార్లు భార్యను మందలించినప్పటికీ, ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో భర్త తమ సంబంధానికి అడ్డుగా మారుతున్నాడని భావించిన కల్పన హత్యకు పథకం రచించింది. మే 16న ముత్యం రెడ్డిని బోర్ మోటార్ స్టార్టర్ రిపేర్ పని ఉందని నమ్మించిన పండరి, అతడిని తన పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ ముందుగానే ఉన్న విట్టల్‌తో కలిసి తాడుతో మేడ బిగించి హత్య చేశారు. అనంతరం శవాన్ని ముందుగా జేసీబీతో తవ్విన గుంతలో పాతిపెట్టి మట్టితో కప్పివేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో గైని పండరి (24), గైని విట్టల్ (33), శంబన్‌లొల్లా కల్పన (30)లను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

కల్లు మత్తు కిక్కులో ఘర్షణ

కల్లు బట్టీలో ఒకరి దారుణ హత్య

మరొకరు సీరియస్

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :కృత్రిమం గారసాయనాలతో తయారైనా కల్లు ఇచ్చిన కిక్కు లో కొందరి మధ్య జరిగిన ఘర్షణ ఒకరు హత్య కు గురికాగా మరోకరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. చిత్తు కాగితాలు ఏరుకునే జీవనం సాగించే ఐదుగురు మధ్య నిజామాబాద్ నగరం లోని పూలాంగ్ కల్లు బట్టీ లో ఆదివారం రాత్రి ఘర్షణ జరిగింది. అందులో ఇద్దరుమి త్రులు పూలాంగ్ కు చెందిన షాకీర్, ఇంద్రపూర్ కు చెందిన కమ్మరి శివ లపై మరో ముగ్గురు దాడి చేశారు. కల్లు కాంపౌండ్ లో కల్లు సేవించిన తరువాత స్వల్పంగా మాటా మాటా పెరిగిన తరువాత జరిగిన దాడిలో షాకీర్ అక్కడికక్కడే ప్రాణాలు పోగొట్టుకున్నాడు. మరో వ్యక్తి శివను 108 అంబులెన్స్ లో జిల్లా ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఘర్షణ గల కారణాలు తెలియలేదు. ఇద్దరిపై దాడి చేసిన వారు అక్కడి నుంచి పరారీ అయ్యారు. స్థానిక కల్లు బట్టి మధ్య విక్రయం జరుగుతుందే అనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు పూలాంగ్ కల్లు బట్టి లో జరిగిన ఘర్షణ, మర్డర్ లపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డేంజర్ డ్రగ్ తో కల్లు తయారీ నా?..... నిషేధిత మత్తు పదార్థాలు కలిపి తయారు చేసే కృత్రిమ కల్లు మత్తులో ఇందూర్ నగరం జోగుతోంది. కిక్కు కోసం తయారి కల్లు లో ఒకప్పుడు క్లోరోపాంహైడ్రోపాం కలిపేవారనేది జగమెరిగిన సత్యం. నిజామాబాద్ జిల్లాలో, జిల్లా కేంద్రంలో కృత్రిమ కల్లుతయారిలో డేంజర్ డ్రగ్ గా పేరున్న నిషేదిత అల్ప్రాజోలంవాడుతారనేది అందరికి తెలిసినదే. కిలోకు రూ.10 లక్షల విలువైన ఆల్ప్రాజోలంనిషేధించింది ప్రభుత్వం. దానికి కోకైన్, హెరాయిన్ జాబితాలో చెర్చి డేంజర్ డ్రగ్ గానామకరణం చేసింది. కల్లు ముస్తే దారులు, కాంట్రాక్టర్ లు సహజ సిద్ధమైన కల్లు దొరక్కుదానికి అలవాటు పడిన వారిని మత్తు కల్లు కు బానిసలు చేసిన విషయం తెలిసిందే. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కల్లు బట్టిలలో డేంజర్ డ్రగ్ గా పేరుగాంచిన అల్ప్రాజోలం తయారి కల్లు విక్రయాలుజరుగుతున్నాయి. నిత్యం లక్షల లీటర్ల కల్లు డిపో లో తయారు చేసే కల్లులో కిక్కు కోసం నిషేదిత మత్తు పదార్థాలు కలుపుతారనేదిఅందరికి తెలిసిందే. రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి తర్వాత నిషేదిత మత్తు పదార్థందేంజర్ డ్రగ్ గా పేరుగాంచిన అల్ప్రాజోలం దొరికేదిఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో. కేసులు గట్రా అయినప్పటికి కల్లు డిపోలో అల్ప్రాజోలంవినియోగం మాత్రం అగడం లేదు. తమపద్ధ అల్ప్రజోలం వినియోగం సంబంధించిన ల్యాబ్ లేదనిసాకుతో కల్లు డిపోలలో కల్లును తయారు చేస్తు, కల్లు బట్టిలలో విక్రయాలు జరుగుతున్న పోలీస్, ఎక్సైజ్, నార్కోటిక్శాఖలు ఎన్నడు పట్టించుకున్నది లేదు అనే ఆరోపణలు ఉన్నాయి.

వృద్ధుడి హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ :అరవై ఐదేళ్ల వృద్ధుడిని హత్య చేసిన కేసులో ముద్దాయి సోమ నవీన్ రెడ్డి కి జీవిత కారాగార శిక్ష, ఎస్ సి,ఎస్ టి అత్యాచారాల చట్టంలోని సెక్షన్ 3(2)(వి) షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి అని తెలిసి నేరానికి పాల్పడినందున ఐదు సంవత్సరాల కఠిన జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అత్యాచారాల విచారణ న్యాయస్థానం స్పెషల్ సెషన్స్ జడ్జి సుగాలి నారాయణ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు వెలువరించిన తీర్పులోని వివరాలు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కోర్టుకు సమర్పించిన నేర అభియోగ పత్రం అదారంగా కోర్టు నేర న్యాయ విచారణలో మొత్తం పన్నెండు మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసుకుని, పన్నెండు ధ్రువీకరించుకున్న వత్తాలు, ఏడు వస్తుగత సాక్ష్యాలు మార్క్ చేసుకున్న అనంతరం... మెండోరా మండలం బస్సపూర్ గ్రామానికి చెందిన అరవై ఐదేళ్ల వయసు గల సుద్దపల్లి లింగన్న 27 ఆగస్టు, 2021 న పొద్దున తెల్లవారు జామున గ్రామ బస్ స్టాండ్ వద్ద గల రాజస్థాన్ హోటల్ దగ్గరకు ఛాయ్ తాగడానికి వెళ్ళాడు. అప్పటికే అక్కడ కుంచపు బొర్రన్న తన ద్విచక్ర మోటారు వాహనాన్ని నిలిపి ఛాయ్ తాగుతున్నాడు. అదే గ్రామానికి చెందిన సోమ నవీన్ రెడ్డి వచ్చి బొర్రన్న బైక్ పై అగ్గిపుల్ల గీసి వేశాడు. ఇద్దరి మధ్య కాసేపు గొడవ జరిగింది. బొర్రన్న బైక్ మీద అగ్గిపుల్ల గీసి ఎందుకు వేశావు అని లింగన్న నవీన్ రెడ్డి ని అడిగి, ఊరిలో ఎవరితో మంచిగా ఉండవు అందరితో గొడవ పడతావు అంటు మందలించాడు. ఇద్దరు నస్సు ప్రశ్నిస్తారా అంటు ఆగ్రహంతో ఊగి పోయిన నవీన్ రెడ్డి తన ఇంటిలోకి వెళ్లి గొడ్డలి, పసుపు తవ్వే ఇనుప కొంకి తీసుకుని వచ్చి లింగన్న వీపులో చాలాసార్లు పొడిచాడు, కొంకి తో కూడా పొడిచి తీవ్ర గాయాల పాలు చేశాడు. ఇది చూస్తున్న బొర్రన్న బయపడి అక్కడి నుండి పారిపోయాడు. లింగన్న ను బంధువులు అంబులెన్సు లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్స పొందుతూ ఆయన మధ్యాహ్నం మూడున్నర గంటలకు మృతి చెందాడు అనే నేర అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో రుజువు అయినట్లు కోర్టు నిర్ధారించింది. హత్య చేసినందుకు జీవితఖైదు తో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించారు జరిమానా చెల్లించని యెడల మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తమ తీర్పులో పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి అని తెలిసి నేరానికి పాల్పడినందుకు గాను షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అత్యాచారాల నిరోధక చట్టంలోని సెక్షన్ ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు పదివేను వందల రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని జడ్జి సుగాలి నారాయణ తమ తీర్పులో వ్రాశారు.పోలీసుల తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దయాకర్ గౌడ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

సంతన్న సతీమణికి ప్రశాంత్ రెడ్డి నివాళి

హైదరాబాద్, బతుకమ్మ :మాజీ మంత్రి శనిగరం సంతోష్ రెడ్డి సతీమణి శనిగరం విజయ పార్థివ దేహానికి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాళులర్పించారు. సంతన్న సతీమణి విజయ కాలం చెయ్యడంతో వారి కుటుంబ సభ్యులను వేముల పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఆయన వెంట రాజారామ్ యాదవ్ ఉన్నారు.

బేల్దారి గంగరాం స్మారక ట్రోఫీ విన్నర్ ముదిరాజ్ టీం

వేల్పూర్, బతుకమ్మ :మండలంలోని రామన్నపేట్ గ్రామంలో ఆరు రోజుల పాటు నిర్వహించిన కీ. శే బేల్దారి గంగారం స్మారక క్రికెట్ టోర్నీ ట్రోఫీ విన్నర్ గా స్థానిక ముదిరాజ్ టీం నిలిచారు. ఈ నెల 17 నుండి నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నీలో ముదిరాజ్ టీం, స్ట్రంబ్రేకర్స్ జట్లులు ఫైనల్ కు పోగా సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ లో ముదిరాజ్ టీం విన్నర్ గా, స్ట్రంబ్రేకర్స్ టీం రన్నర్ గా నిలిచాయి. విన్నర్ గా నిలిచిన ముదిరాజ్ టీం కు గ్రామ సర్పంచ్ బేల్దారి నవీన్ ప్రైజ్ మనీ, ట్రోఫీనిచ్చి గోల్డ్ మెడల్స్ తో టీం మెంబెర్స్ ను సత్కరించారు. రన్నర్ గా నిలిచిన స్ట్రంబ్రేకర్స్ టీం కు నగదు ప్రైజ్ మనీ, ట్రోఫీనిచ్చి సిల్వర్ మెడల్స్ తో టీం మెంబెర్లను సత్కరించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి..

నిజామాబాద్, బతుకమ్మ : నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ (ఎం) గ్రామానికి చెందిన ధారావత్ రవి (40) గత ఐదు రోజుల నుంచి ట్రాక్టర్ నడుపుతూ వడదెబ్బకు గురై చనిపోగా స్థానికులు తెలిపారు. వ్యవసాయ పనులలో భాగంగా గత ఐదు రోజుల నుంచి ఏకధాటిగా ట్రాక్టర్ నడుపుతూ వడదెబ్బ బారిన పడడం జరిగిందని స్థానికులు తెలిపారు. వడదెబ్బకు గురై చనిపోయిన మృతుడు రవి నిరుపేద కుటుంబానికి చెందిన వాడని ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సోమలింగ శివాచార్య మహారాజ్ జన్మదిన వేడుకలు

జుక్కల్, బతుకమ్మ : బిచ్కుంద పీఠాధిపతి, పరమ పూజ్యులు సోమలింగ శివాచార్య మహారాజ్ జన్మదిన సందర్భంగా వారి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బిచ్కుంద మండల కేంద్రం లోని బండాయప్ప మఠానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు విచ్చేసి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, మహారాజ్ ఆశీస్సులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక విలువలు, సేవా భావం పెంపొందించడంలో చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో, ఆనందంతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ ఉండాలని ఆకాంక్షించారు.

గ్రామ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ

నందిపేట్, బతుకమ్మ :రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నందిపేట్ గ్రామంలోని మహిళలకు సంబంధించిన గ్రామ సంఘం (వివో బిల్డింగ్) భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఎర్రం లింగం కొబ్బరి కాయ కొట్టి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందర్, సభ్యులు రిమ్మ రవి, కంతం చిన్నయ్య, చింత శ్రీనివాస్, భాస్కర్ ఐకెపి సిబ్బంది, ఐకేపీ ఏపీఎం, సీసీలు మహిళ సభ్యులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన వారిని అభినందించిన సీపీ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లాలో కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ పొందిన వారిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు. తెలంగాణ రాష్ట్ర డి.జి.పి ఆదేశానుసారముగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ గా ఐదుగురు ప్రమోషన్ పొంది సోమవారం సీపీ ని కలిసారు. గత కొంతకాలంగా ప్రమోషన్ గురించి ఎదురు చూస్తున్నటువంటి కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారని ఈ సందర్భంగా ప్రమోషన్ పొందినటువంటి హెడ్ కానిస్టేబుల్ లకు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎండి. ఖలీద్, డి.గౌరీ శంకర్, బి.శివ కుమార్, బి. దూప్ సింగ్, టి శ్రీనివాస్ లకు ప్రమోషన్ వచ్చినట్టు సీపీ తెలియజేశారు

చిన్నారి పట్ల అసభ్యకర ప్రవర్తన

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :నగరంలోని ఆర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నారిపై జరిగిన వేధింపుల ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది. చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి ఓ వ్యక్తి చిన్నారిని వేధించినట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సదరు ప్రాంతానికి చెందిన ఓ చిన్న బాలిక ఇంటి సమీపంలోని దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా, అసద్ బాబా నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆమెను గమనించాడు. అనంతరం చాక్లెట్ ఇస్తానని నమ్మబలికి బాలికను పక్కకు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడి బారి నుంచి తప్పించుకున్న బాలిక ఏడుస్తూ ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన కుటుంబ సభ్యులు వెంటనే ఆర్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ, చిన్నారుల భద్రతపై మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్నారు.